APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 07 సెప్టెంబర్ 2026 సంపుటి: 01 సంచిక :103 పేజీలు : 04 వెల: 2-00/-

## ఏపీలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

మరో 3 గంటల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాల హెచ్చరిక

గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ సూచన



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుంది. రాబోయే మూడు గంటల్లో ఏడు జిల్లాల్లో తీవ్రమైన ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని మిగతా..2లో

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం

ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, ఆరుగురిని కాపాడిన సహాయక బృందాలు

మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు



ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మిగతా..2లో

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2

- ★ హైదరాబాద్ మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఏర్పాటు
- ★ అహింస బలహీనత కాదని, అదొక గొప్ప బలమని కిషన్ రెడ్డి వ్యాఖ్య
- ★ స్థూపం ఏర్పాటులో చొరవ తీసుకున్న జైన మహిళలను కొనియాడిన కేంద్రమంత్రి
- ★ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఐక్యత అవసరమని పిలుపు
- ★ సాంకేతికతతో పాటు సాంస్కృతిక విలువలను కాపాడుకోవాలని యువతకు హితవు

# ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే...

- ▶▶ ప్రపంచ పటాల మార్పుపై ఐరాస తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు
- ▶▶ ప్రస్తుత మ్యాప్ ల్లో ఖండాల సైజులు తప్పుగా ఉన్నాయని పేర్కొన్న తీర్మానం
- ▶▶ ఏ ఒక్క నిర్దిష్ట మ్యాప్ నూ ఆమోదించడం లేదని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం
- ▶▶ సరిహద్దులు, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్పిన వైనం
- ▶▶ జమ్మూకశ్మీర్, లఢఖ్‌లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపాలని పట్టు



ఢిల్లీ : ప్రపంచ పటాల (వరల్డ్ మ్యాప్) విషయంలో ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభలో ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. ప్రపంచ పటాల్లో ఖండాలు, దేశాల సైజులను మరింత కచ్చితంగా, యథార్థంగా చూపించాలన్న ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసింది. అయితే, ఈ మద్దతుకు తమ షరతులు వర్తిస్తాయని, దేశ సార్వభౌమాధికారం, సరిహద్దుల విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని గట్టిగా స్పష్టం చేసింది. మిగతా..2లో

## శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల భద్రతపై టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ సమీక్ష



- ● ధ్వజారోహణం రోజున సీఎం చంద్రబాబు పర్యటన కారణంగా ప్రత్యేక బందోబస్తు
- ● భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు.

అమరావతి : తిరుమలలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిగతా..2లో

## అందనంత దూరంలో మీరు అందుకే ప్రచారాలు అవసరం'

★ ప్రధాని మోదీ 'యాంగ్రీ అంకుల్ ' వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్



ఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ 'యాంగ్రీ అంకుల్ ' వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో మాట్లాడిన ప్రధాని మోదీ విద్య, ఉద్యోగాలు, యువజన సంక్షేమం గురించి మాట్లాడకుండా, దానిని రాజకీయ ప్రచారంగా మార్చేశారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై రాజకీయ ముద్రలు వేస్తున్నారని విమర్శించారు. విమర్శనాత్మక ప్రశ్నలను అణచివేయడానికి, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి విపక్షాలను కించపరిచే విశేషణాలను వాడడం ఆయనకు అలవాటుగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. "ప్రధాని మోదీ- మీరు నిన్న ఢిల్లీ యూనివర్సిటీలోని ఎస్ ఆర్ సీసీని సందర్శించారు. దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై మాట్లాడడానికి అది ఒక మంచి అవకాశం. కానీ మీరు యువత వేసే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు బదులుగా, మీ ప్రసంగం కాస్త మరో రాజకీయ ప్రచారంగా మార్చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణచివేయడానికి, సొంత వైఫల్యాలను దాచడానికి మీరు ప్రతిపక్షాలకు కొత్త విశేషణాలను సృష్టిస్తున్నారు. నారాజ్ ఫూఫా (కోపదారి మేనమామ), దిమాగీ నక్సల్ , అర్బన్ నక్సల్ , ఖాన్ మార్కెట్ గ్యాంగ్ , ఆందోళనజీవి, పరాన్నజీవి ఇలా చాలా విశేషణాలు మారుతూ ఉన్నప్పటికీ, మీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు మాత్రం మారడం లేదు." మిగతా..2లో

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ ప్రకాశరావు!



- ● న్యూఢిల్లీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా
- ● తండ్రి ఉద్యోగరీత్యా అండమాన్‌కు వెళ్లిన ప్రకాశరావు అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు.

కోనసీమ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం చెన్నడం గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు జల్లి ప్రకాశరావు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. న్యూఢిల్లీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తండ్రి ఉద్యోగరీత్యా అండమాన్‌కు వెళ్లిన ప్రకాశరావు మిగతా..2లో

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

- ● డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం
- ● 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం!



ఢిల్లీ : డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్ ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం మిగతా..2లో

## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి



2

- ★ సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ★ ఇప్పటిదాకా ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22 ఏలో పెట్టలేదని తెలిపారు.

సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 6 : సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావుఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22 ఏలో పెట్టలేదని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఎంపీ రఘునందన్ రావు ఈరోజు (ఆదివారం) పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ప్రజల భూములను ఈ రోజు దాకా దేశంలో ఏ ప్రభుత్వం కూడా చివరకు ఇందిరా గాంధీ హయాంలో

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

- ▶▶ ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- ▶▶ హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ▶▶ బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్ : కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారు మిగతా..2లో

## కొడంగల్‌పై కవిత ఫోకస్.. కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ



2

- ● తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత కొడంగల్‌పై ఫోకస్ పెట్టారు.
- ● కొడంగల్ కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పాంచజన్య శంఖారావం చేపడుతున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : తెలంగాణ రక్షణ సేన అధినేత కవిత కొడంగల్‌పై ఫోకస్ పెట్టారు. కొడంగల్ కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పాంచజన్య శంఖారావం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీన కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు (ఆదివారం) తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో

అనంత సూర్య తెలుగువార్త
సోమవారం 07 సెప్టెంబరు 2026

మొదటి పేజి తరువాయి

## ఏపీలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

విపత్తుల నిర్వహణ సంస్థ తన ప్రకటనలో పేర్కొంది. వర్ష తీవ్రత, పిడుగుపాటు ప్రమాదం అధికంగా ఉండటంతో ఇంతకుముందు జారీ చేసిన ఆరెంజ్ అలర్ట్‌ను తాజాగా రెడ్ అలర్ట్‌గా సవరించినట్లు వెల్లడించింది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల దృష్ట్యా ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాల కింద, శిథిల భవనాల్లో ఆశ్రయం పొందవద్దని హెచ్చరించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు. పక్కా ప్లాన్ తో డ్రగ్స్ నివారణ 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్ వర్క్ ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్ ఫోర్స్ లను (ఏఎన్ టీఎఫ్ ) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్ ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు. "మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్ , పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్ కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్ లైన్ ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

### నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్ ' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్ వర్క్ లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్ -మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ ప్రకాశరావు!

అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. అండమాన్ నికోబార్ దీవుల్లో తెలుగు బోధనతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి విశేష సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయనకు పురస్కారం లభించడంతో చెన్నడం గ్రామస్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కొడంగల్‌పై కవిత ఫోకస్.. కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ

పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

### బహుజన తెలంగాణ సాధనే మా లక్ష్యం..

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని కవిత విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో సగం కూడా ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. బహుజన తెలంగాణ సాధనే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. తెలంగాణ రక్షణ సేనలో బీజేపీ కొడంగల్ ఇన్‌చార్జి ప్రభాకర్ కులకర్ణి చేరారు. కులకర్ణితో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ కోసం పనిచేస్తానని ప్రభాకర్ కులకర్ణి పేర్కొన్నారు.

## ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే...

శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 'మెర్కేటర్ ప్రొజెక్షన్' మ్యాప్ ల్లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. ఉదాహరణకు, ఆఫ్రికా కంటే 14 రెట్లు చిన్నదైన గ్రీన్‌ల్యాండ్, ఈ మ్యాప్ ల్లో దాదాపు ఆఫ్రికా సైజులోనే కనిపిస్తుంది. ఈ వక్రీకరణను సరిదిద్దేందుకు 'ఈక్వల్-ఏరియా' (సమాన విస్తీర్ణం) ప్రొజెక్షన్‌లను ప్రోత్సహించాలని కోరుతూ 'కరెక్ట్ ది మ్యాప్' పేరుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఆఫ్రికా, భారత్ వంటి గ్లోబల్ సౌత్ దేశాలు వాటి వాస్తవ పరిమాణంలో కనిపిస్తాయి. సెప్టెంబర్ 4న జరిగిన ఓటింగ్‌లో ఈ తీర్మానానికి అనుకూలంగా 164 దేశాలు ఓటు వేయగా, అమెరికా వ్యతిరేకించింది. మరో 6 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఈ ఓటింగ్‌పై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ఖండాల వాస్తవ పరిమాణాన్ని చూపించే సూత్రానికి మాత్రమే తాము మద్దతిస్తున్నామని, దీనివల్ల ఏదో ఒక నిర్దిష్ట మ్యాప్ ను (ఈక్వల్ ఎర్త్ వంటివి) ఆమోదిస్తున్నట్లు కాదని తెలిపారు. ఈ తీర్మానానికి, రాజకీయ సరిహద్దులకు, వివాదాస్పద ప్రాంతాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని భారత్ తేల్చిచెప్పింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లఢఖ్‌లతో కూడిన భారత భూభాగాన్ని, దేశ అధికారిక మ్యాప్ ప్రకారమే కచ్చితంగా చూపించాలని ఉద్ఘాటించింది. దీనికి భిన్నంగా చిత్రీకరించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అంగీకరించబోమని పేర్కొంది. ఈ తీర్మానం దేశాలపై చట్టపరంగా తప్పనిసరి కానప్పటికీ, వాస్తవ సైజులు ముఖ్యమైన చోట ఈక్వల్-ఏరియా మ్యాప్ లను వాడాలని ప్రభుత్వాలను, సంస్థలను ప్రోత్సహిస్తుంది.

## ఒళ్లంతా అవినీతి బురదే!

భారతావని సమైక్యతను పరిరక్షించే ఉక్కుచట్రంగా సివిల్ సర్వీసులు వెలుగొందాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశించారు. కానీ, ప్రజాసేవను పక్కనపెట్టి తప్పుడుదోవల్లో తమ జేబులు నింపుకోవడానికి తహతహలాడుతున్న కొందరు అవినీతి ఉన్నతాధికారుల పుణ్యమా అని ఆ ఉక్కుచట్రం క్రమంగా తుప్పుపడుతోంది. లంచాల మేతలకు అలవాటుపడిన పెద్దమనుషుల దెబ్బకు తన స్వరూప స్వభావాలనే కోల్పోతోంది. ఉద్యోగంలోకి రాకమునుపు సమాజ సేవకుల్లా నీతిసూత్రాలు చెబుతూ రాజ్యాంగ విధేయత, పారదర్శక పాలన, పేదరిక నిర్మూలన అంటూ తెగ కలవరించే కొంతమంది- సివిల్ సర్వీసుల్లోకి రాగానే ఆదర్శాలకు చెల్లుచీటీ రాస్తున్నారు. నిర్లజ్జగా అక్రమాలకు పాల్పడుతూ ఉన్నతాధికార స్థానాలపై సమాజంలో ఉండే గౌరవమర్యాదలను నీరుగారుస్తున్నారు. మంచి వేతనం, పెద్ద బంగ్లా, కారు, భద్రత, వ్యక్తిగత సిబ్బంది... అసలు ఐఏఎస్, ఐపీఎస్ అంటేనే ఆ దర్జానే వేరు. ఆ ఆర్భాటాల మాయలో పడిన వారు ప్రజలకు దూరమవుతారు. అలాకాకుండా తమ చేతిలోని అధికారాన్ని సామాన్యుల కోసం సద్వినియోగం చేస్తే, జనం వారిని గుండెల్లో పెట్టుకుంటారు. కానీ, అలా సమాజానికి ఉపయోగపడదామన్న ఆలోచనే కొందరిలో ఉండట్లేదు. అరుదైన అవకాశాన్ని అందించిన దేశానికి రుణపడి ఉంటూ పేదసాదల బతుకులను మార్చడానికి తామేం చేయాలన్న తలపును కూడా వారు దగ్గరికి రానివ్వట్లేదు. ఎంతసేపూ ఎంతెంత సంపదను కూడగట్టుకుందామా అన్నదానిపైనే వాళ్ల దృష్టి అంతా ఉంటోంది. హరియాణాలో భారీ ఆర్థిక నేరం కేసులో సీబీఐ తాజాగా ఆరుగురు ఐఏఎస్‌లపై మూడో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో బ్యాంకు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో ఐఏఎస్‌లు కుమ్మక్కు అయ్యి హరియాణా ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన దాదాపు ఆరు వందల కోట్ల రూపాయల నిధులను దారిమళ్లించారని చెబుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది సక్రమ మార్గంలో నడిచేలా చూడాల్సినవారే ఇలా బుద్ధిగడ్డి తిని ప్రజాధనాన్ని స్వాహా చేయడమెంత సిగ్గుచేటు! రాజస్థాన్ జల్‌జీవన్ మిషన్ టెండర్లలో అవకతవకలకు పాల్పడ్డారంటూ మాజీ ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. గతంలో ఈయన అదనపు ప్రత్యేక కార్యదర్శిగా ఉద్యోగం వెలగబెట్టారు. అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాక చాలారోజులు పరారీలో ఉన్నారు. అడుసు తొక్కనేల.. కాలు కడగనేల అన్నట్లు అడ్డగోలు మార్గాల్లో డబ్బు వెనకేసుకోవడానికి అర్రులుచాచకుండా ఉంటే దొంగలా బతకాల్సిన అగత్యం తప్పేది కదా! కర్ణాటకలో పశువైద్యాధికారుల పోస్టుల మంజూరుకు లంచాలు కతికిన కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్‌ను సీఐడీ అదుపులోకి తీసుకుంది. అయిదు వేల కోట్ల రూపాయల నకిలీ మందుల రాకెట్ దర్యాప్తును ఒక వ్యాపారికి అనుకూలంగా మార్చేందుకు రూ.3కోట్ల లంచం అడిగిన ఆరోపణ మీద హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లావత్‌ను మొన్న జులైలో సీబీఐ అరెస్టు చేసింది. సామాన్య ప్రజల ప్రాణాలతో ముడిపడిన కేసులోనూ ఇలా అవినీతి దారులు వెతకడం ఎంత హేయం!

## అందనంత దూరంలో మీరు- అందుకే ప్రచారాలు అవసరం'

మొదటి పేజి తరువాయి

### మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

### ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

యువత రిపోర్ట్ కార్డులో పెరుగుతున్న నిరుద్యోగం, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లు, ఖరీదైన విద్య, తగ్గిపోతున్న స్కాలర్ షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి లాంటివి ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ- మీరు అందనంత దూరంలో ఉన్నప్పుడే మీకు ప్రత్యేక పరిచయ కార్యక్రమం అవసరం అవుతుంది. మోదీ తన రిపోర్టు కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్టు కార్డుతో సిద్ధంగా ఉంది. ఆ రిపోర్టు కార్డులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ ఖరీదు అవుతున్న విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిపై



పెరుగుతున్న ఒత్తిడి మొదలైనవి ఉన్నాయి. అందుకే విద్యార్థుల గొంతుక వినండి. సమస్యను పక్కదారి పట్టించడం వల్ల అవి పరిష్కారం కావు" అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### యాంగ్రీ అంకుల్స్

శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని 'యాంగ్రీ అంకుల్స్ ' అని అభివర్ణించారు. మోదీ ఎస్ ఆర్ సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్ లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు- 'దీని అవసరం ఏముంది?'. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు పూఫాలు (అసంతృప్తితో ఉండే బంధువులు) దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు. కానీ వారందరికీ భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. దేశానికి అవసరమైన పనిని చేయడానికి భారతదేశాన్ని ఎవరూ ఆపలేరు" అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు.

## తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు – పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు

మొదటి పేజి తరువాయి

స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను తిలకించేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల నాలుగు మాడ వీధులతో పాటు, భక్తులు రద్దీగా ఉండే ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీఎస్‌వో మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తారని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధ్వజారోహణం రోజున సీఎం పర్యటన: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 15న ధ్వజారోహణం సేవ జరగనుంది. ఆ రోజున సీఎం చంద్రబాబు తిరుమలకు విచ్చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక బందోబస్తుతో పాటు అవసరమైన చోట్ల బ్యారికేడింగ్‌ను నిర్మిస్తున్నారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గరుడ సేవకు భారీ ఏర్పాట్లు: సెప్టెంబర్ 19న గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. అందువల్ల తిరుమల, తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సీవీఎస్వో తెలిపారు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాఫిక్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా మార్గనిర్దేశం చేసేందుకు తిరుమల, తిరుపతి ప్రధాన కూడళ్లలో వివిధ భాషల్లో సైన్ బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా పటిష్ఠ బందోబస్తు: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తుల భద్రతతో పాటు క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, ఫైర్, ఫారెస్టు, ఇంటెలిజెన్స్, ఆర్టీసీ, రైల్వే తదితర శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాల సమయంలో భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల షెడ్యూల్ : ఈ ఏడాది అధిక మాసం కారణంగా తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక



ఆనందంలో పరవశింపజేయనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనున్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

మొదటి పేజి తరువాయి

: తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్ , అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలి : కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని



ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు. ఉభయసభల్లో ఎండగట్టాలి : అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయసభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని వెల్లడించారు.

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి

కూడా 22 ఏ లో పెట్టలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల, నోరు లేని అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహించారు. దాదాపు లక్ష కోట్ల పేదల భూములను 22ఏలో పెట్టి భారీ కుంభకోణానికి తెర లేపారని ఆరోపించారు. లక్ష కోట్ల భూముల పంచాయితీలో పైసలు పంచుకుంటున్న మంత్రులు ఎవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లేదా ఈ పైసలన్నీ తన ఖాతాలోనే వేసుకుంటానని అనుకుంటే సీఎం అయినా దీనికి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. 22 ఏ లో పేదల భూములను పెట్టొద్దని.. అవి తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆస్తులని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఈసారి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరు కావాలని కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడితే వారికి గౌరవం ఉంటుందని రఘునందన్ రావు సూచించారు.

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

మొదటి పేజి తరువాయి

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు. సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం



కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ




కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్-జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె. విశ్వేశ్వర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు,సెప్టెంబర్ 6(అనంత సూర్య):జర్నలిజం రంగంలో విశేష సేవలు, వృత్తిపరమైన ప్రతిభ కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ జర్నలిస్టు అవార్డులను ప్రకటించనుంది.మొత్తం 12 విభాగాల్లో అవార్డులకు అర్హులైన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ - 520013 చిరునామాకు పంపాలని సూచించారు.దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేసే పురస్కారాల్లో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు రూ.2 లక్షలు, మూడు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులకు, సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు, ఉత్తమ కార్టూనిస్టు, అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు, ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు, ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున నగదు పురస్కారం అందజేయనున్నారు.విఆర్ నార్ల జీవిత సాఫల్య పురస్కారం, కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు, మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డులకు ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించరు. ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో ఈ అవార్డు గ్రహీతలను ఎంపిక చేస్తుంది.దరఖాస్తుదారులు తమ సంస్థ, ఉద్యోగం, అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. కనీసం ఐదు వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్‌ను దరఖాస్తుతో జతచేయాలి. ఇవి 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 మధ్య ప్రచురితమైనవి లేదా ప్రసారమైనవి అయి ఉండాలి. ఫొటోకాపీల రూపంలోనూ సమర్పించవచ్చని తెలిపారు.అవార్డు గ్రహీతల ఎంపికలో ఎంపిక కమిటీదే తుది నిర్ణయమని, తగిన సంఖ్యలో లేదా ప్రమాణాలతో దరఖాస్తులు అందని విభాగాల్లో అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం కమిటీకి ఉంటుందని స్పష్టం చేశారు. పూర్తి అర్హతలు, దరఖాస్తు విధానం, నిబంధనలను సమాచార పౌరసంబంధాల శాఖ మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని తెలిపారు.

# రాష్ట్ర స్థాయి పోలీస్ మీట్ లో చిల్లకల్లు ఎస్సై ప్రతిభ

జగ్గయ్యపేట,సెప్టెంబర్ 06,(అనంత సూర్య): స్టేట్ డ్యూటీ పోలీస్ మీట్ లో చిల్లకల్లు సబ్ ఇన్‌స్పెక్టర్ నాగ సాయి మణికంఠ అద్భుత ప్రతిభ కనబరిచి రికార్డు సృష్టించారు.తన అసాధారణ నైపుణ్యాలతో పోలీస్ శాఖకు తన ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు.ఈ ప్రతిష్టాత్మక పోటీలలో ఆయన రెండు విభాగాలలో కాంస్య పతకాలను సాధించారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఫోటోగ్రఫీ విభాగంలో ఒక కాంస్య పతకాన్ని, అలాగే లా ఎగ్జామినేషన్ (న్యాయ పరీక్ష) విభాగంలో మరొక కాంస్య పతకాన్ని గెలుచుకొని తన వృత్తిపరమైన నైపుణ్యాన్ని చాటుకున్నారు. వ్యక్తిగత పతకాలతోనే కాకుండా, ఆయన ప్రాతినిధ్యం వహించిన బృందం కూడా ఈ మీట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, ఓవరాల్ టీమ్ కేటగిరీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని, ప్రతిష్టాత్మకమైన ఫస్ట్ ర్యాంక్ ట్రోఫీని అందుకుంది.ఈ అద్భుత విజయాన్ని సాధించిన




అనంతరం ఎస్ఐ నాగ సాయి మణికంఠ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు,అలాగే ఎన్టీఆర్ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సాధించిన పతకాలు, ట్రోఫీని ఉన్నతాధికారులకు చూపించారు.కఠినమైన విధుల్లో



ఉంటూనే రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగ సాయి మణికంఠ వారి బృందాన్ని సీపీ రాజశేఖర్. బాబు, డీసీపీ, లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రపంచ స్థితిని మార్చగలిగేవాడే ఉపాధ్యాయుడు




విశాలాంధ్ర బుక్‌హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు

.గన్నవరం,సెప్టెంబర్ 06,అనంత సూర్య): ప్రపంచ స్థితిని,స్వరూపాన్ని మార్చగలిగే శక్తి ఉపాధ్యాయుడికి ఉందని వి.కె.ఆర్. కళాశాల విశ్రాంత లెక్చరర్,వామపక్ష వాది, ఆంధ్రప్రదేశ్ విశాలాంధ్ర బుక్‌హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు అన్నారు.హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గన్నవరం మండలం దావాజి గూడెంలోని స్పందన మానసిక వికాస కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ,డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సాధారణ ఉపాధ్యాయుడి స్థాయి నుంచి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని, విద్యార్థుల అభ్యున్నతికి అందించిన సేవలకు గుర్తింపుగా సర్వేపల్లి జయంతిని దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా మనమంతా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు తమ వృత్తికి అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ముఖ్యంగా మానసిక దివ్యాంగ బాలలకు బోధించే ఉపాధ్యాయులు ప్రేమ, నైపుణ్యం, ఓర్పు, సహనంతో పాటు బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే వారి జీవితాల్లో మరింత మెరుగైన మార్పు తీసుకురాగలమన్నారు.గన్నవరం ప్రాంతంలో దివ్యాంగుల సంక్షేమం కోసం స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఎంతోమంది దివ్యాంగ బాలల అభివృద్ధికి కృషి చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న తన శిష్యుడు, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ సేవలను గడ్డం కోటేశ్వరరావు గప్రశంసించారు.గురుపూజోత్సవ విశిష్టత పుర-స్కరించుకొని ముఖ్యఅతిథిగా విచ్చేసిన గడ్డం కోటేశ్వరరావు నీ స్పందన మానసిక వికాస కేంద్రంలోని బాలలకు ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ తరపున ఘనంగా సత్కరించడం జరిగింది. బాలలకు స్వీట్లు,పండ్లు అందించడంతో పాటు ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్, దినేష్ రాణి స్పందన మానసిక వికాస కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హామీలపై బీఆర్ఎస్ సమరభేరి కాంగ్రెస్ ప్రభుత్వంపై సర్పంచ్‌ల ధ్వజం

**నాగులవంచలో నిరసన కార్యక్రమం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం.**

చింతకాని,సెప్టెంబర్ 06,అనంత సూర్య): ఖమ్మం జిల్లా,చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమ-యంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు .ఈ సందర్భంగా తిరుమలాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, తిమ్మినేనిపాలెం బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు,బొప్పారం బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ షేక్ రహమతుల్లా, కోమట్లగూడెం బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు తదితరులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని వారు ఆరోపించారు. హామీలను అమలు చేయాలని ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గ్రామీణ ప్రాంత ప్రజలకు, య-ువతకు ,రైతులకు,మహిళలకు వివరించి .వాటి అమలు పరిస్థితిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే ప్రజల తరపున మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 26 గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు.నాగులవంచలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి చింతకాని మండలంలోని 26 గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ,యువకులు, కార్యకర్తలు, సర్పంచులు,వార్డు సభ్యులు,సొసైటీ డైరెక్టర్లు,మాజీ ఎంపీపీలు,వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం సమీక్షించి,ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ నాయకులు,26 గ్రామాల పార్టీ నాయకులు,యువజన నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు,వార్డు సభ్యులు,సొసైటీ డైరెక్టర్లు,మాజీ ఎంపీపీలు,వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు,సెప్టెంబర్ 6 (అనంత సూర్య):చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) నేడు ఉదయం 10.30 గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నారు.ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసి, ఫిర్యాదుల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ శాఖ సూచించింది.

## నగరిలో కేంద్ర,రాష్ట్ర జౌళి శాఖాధికారుల పర్యటన

చిత్తూరు,సెప్టెంబర్ 6 (అనంత సూర్య):ఈనెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వ టెక్స్టైల్ కమిషనర్ వృందా మనోహర్ దేశాయి, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి నగరి పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సెప్టెంబర్ 8న ఉదయం 11.30 గంటల నుంచి నగరిలోని సమగ్ర వస్త్ర, దుస్తుల కేంద్రం (ఐటీడీఏసీ), స్థానిక పవర్‌లూమ్ ఉత్పత్తి కేంద్రాలు, డైయింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించనున్నారు.మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీ ఎస్.ఎం.టి. పొన్నుస్వామి శంకరమ్మాళ్ కల్యాణ మండపంలో పవర్‌లూమ్ యూనిట్ హోల్డర్లు, స్టేక్‌హోల్డర్లు, టెక్స్టైల్ యూనిట్లు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెక్స్టైల్స్ స్టాటిస్టికల్ రిటర్న్స్ సిస్టమ్ (టీఎస్ఆర్ఎస్)లో నమోదు, దాని ప్రయోజనాలు, జిల్లాలో 3,400 పవర్‌లూమ్ యూనిట్లకు అమలు చేసిన 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టనున్న నూతన పథకాలపై అవగాహన కల్పించనున్నారు. పవర్‌లూమ్ యూనిట్ హోల్డర్లు, స్టేక్‌హోల్డర్లు, టెక్స్టైల్ యూనిట్లు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ కోరారు. పవర్‌లూమ్ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చిత్తూరు, సెప్టెంబర్ 6 (అనంత సూర్య):జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.సెప్టెంబర్ 7న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు.ప్రజలు తమ పూర్తి వివరాలతో పాటు సమస్యకు సంబంధించిన అర్జీలను సమర్పించి పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలను కూడా వినియోగించుకోవాలని కోరారు.

## తాడిమర్రిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



శ్రీ సత్యసాయి జిల్లా : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండల బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం పిన్నదరి గ్రామంలో నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీ.ఎం. శేఖర్ సూచనల మేరకు ఈ సమావేశం జరిగింది. బీజేపీ తాడిమర్రి మండల అధ్యక్షుడు దేవర రాంమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బిల్లు కుళ్లాయప్ప యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, మండలంలో పార్టీ కార్యక్రమాల విస్తరణ, గ్రామస్థాయిలో ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మండల బీజేపీ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, పిన్నదరి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తృతీయ వర్ధంతి స్మరణాంజలి




సెప్టెంబర్ 06,(అనంత సూర్య): స్వర్గీయ యాదాటి క్రిష్ణయ్య యాదవ్ గారి 3వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు. కుటుంబ సభ్యులు ఆయనను స్మరించుకుంటూ ఆత్మీయ నివాళులు అర్పించారు. "మన మధ్య మీరు లేకపోయినా.. మీ జ్ఞాపకాలు మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచే ఉంటాయి" అని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. స్మరించుకున్నవారు: భార్య యాదాటి సావిత్రి, పెద్ద కుమారుడు యాదాటి సునీల్ యాదవ్, కోడలు ధనలక్ష్మి, మనవరాలు యిశ్విక కృష్ణ యాదవ్, చిన్న కుమారుడు యాదాటి కిరణ్ యాదవ్, భార్య జయశ్రీ/కావ్య శ్రీ, మనవడు బాసీత్ కృష్ణ యాదవ్

# పారామెడికల్, స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలి

## - కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నర్సులు ఆదివారం చేపట్టిన క్యాండిల్ ర్యాలీకి ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. పారామెడికల్, స్టాఫ్ నర్సుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లికార్జున, బహుజన యువజన రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గృహాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విదేశీ పర్యటనల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయడం కంటే.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని వారు కోరారు. కార్యక్రమంలో పారామెడికల్, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం



అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : అనంతపురం అర్బన్ బ్యాంక్ 110వ మహాజనసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ జె.ఎల్. మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతపురం అర్బన్ బ్యాంక్ 110 సంవత్సరాలుగా ప్రజల నమ్మకాన్ని చూరగొని విజయవంతంగా కొనసాగుతుండటం ఎంతో గర్వకారణమన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో సభ్యులు, ఖాతాదారులు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. ఖాతాదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బ్యాంక్ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు సభ్యుల సంక్షేమం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు విస్తరించడమే తమ లక్ష్యమన్నారు. అనంతపురం అర్బన్ బ్యాంక్ ప్రజల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్తులో కూడా మరింత ప్రగతి సాధించే దిశగా పాలకవర్గం, సిబ్బంది సమిష్టిగా పనిచేస్తారని చైర్మన్ తెలిపారు. ఈ మహాజన సభలో బ్యాంక్ వైస్ చైర్మన్లు చింతల భాస్కర్, జంగంశెట్టి రామాంజినేయులు, డైరెక్టర్లు సుబ్రమణ్యం, కృష్ణ కుమార్, బావిగడ్డ రమణయ్య, గోల్డ్ బాషా, మాగిశెట్టి చంద్రశేఖర్, వెంకటాద్రి, రొల్ల భాస్కర్, అనీల్ నాయుడు, పుల్లప్ప, గిరీష్, బిఓఎం మెంబర్లు విజయ్ భాస్కర్, సునీల్ రాయల్, సందర్శ్, బ్యాంక్ సీఈఓ నవీన్, మేనేజర్లు ఖాజా, మేఘన, రాధ, హేమా, రాము, సతీష్, చంద్రశేఖర్, బ్యాంక్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు. బ్యాంక్ వార్షిక నివేదిక, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

# మసీదు నిర్మాణానికి

## శంకుస్థాపన చేసిన ఎంపీ అంబికా





అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : నగరంలోని రామ్‌నగర్ 80 ఫీట్ రోడ్‌లో నూతన మసీదు నిర్మాణానికి ఆదివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి మసీదు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, మసీదు నిర్మాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తవ్వాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం అభివృద్ధితో పాటు మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేసేందుకు మనమంతా కలిసి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ముతవల్లి రాష్ట్ర సంఘం అధ్యక్షులు షకీల్ సఫీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠ ప్రభాకర్ చౌదరి, టౌన్ బ్యాంక్ చైర్మన్ మురళి, సీపీఐ జాఫర్, నౌషాద్, నరసింహులు, వెంకటేశ్వర్ రెడ్డి, మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతపురం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు.

# 48వ డివిజన్ వైపు.. జనసేన చూపు!



- కూటమిలో భాగంగా ఆ డివిజన్ టికెట్ జనసేనకిచ్చేరా?
- ప్రతిపక్ష మాజీపై అవినీతి ఆరోపణలు..
- కూటమి నేతపై నేరారోపణలు
- వీరి మధ్య వైరంతో జనసేనకు కలిసొచ్చేనా!

**అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య :**

అనంతపురం నగర రాజకీయాల్లో 48వ డివిజన్‌పై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రానున్న స్థానిక రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఈ డివిజన్‌ను జనసేన పార్టీకి కేటాయించే అవకాశాలపై కూటమి వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే సీట్ల పంపకం, అభ్యర్థి ఎంపికపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఇదిలా ఉండగా.. 48వ డివిజన్‌లో గతంలో ప్రాతినిధ్యం వహించిన ప్రతిపక్ష నేతపై అవినీతికి సంబంధించిన ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు కూటమికి చెందిన స్థానికేతర నేతపై కూడా పలు నేరారోపణలు ఉన్నాయంటూ ప్రత్యర్థి వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలకు సంబంధించి సంబంధిత నేతల వివరణలు, అధికారిక దర్యాప్తు లేదా న్యాయపరమైన తుది నిర్ధారణలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇద్దరు నాయకుల మధ్య నెలకొన్న రాజకీయ వైరమే ఇప్పుడు జనసేనకు అనుకూలంగా మారుతుందా ? అనే చర్చ స్థానికంగా సాగుతోంది. ప్రధాన పార్టీల మధ్య వ్యక్తిగత విభేదాలు, వర్గపోరు పెరిగితే ప్రత్యామ్నాయంగా జనసేన అభ్యర్థిని బరిలోకి దింపే అవకాశాలు మెరుగుపడతాయని ఆ పార్టీ అనుచరులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే కూటమిలో సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు, అభ్యర్థి సామర్థ్యం, ఆయా పార్టీల అధిష్టానాల నిర్ణయాలపైనే 48వ డివిజన్ భవిష్యత్ సమీకరణాలు ఆధారపడి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. **మొత్తంగా..** ఇద్దరు ప్రత్యర్థి వర్గాల మధ్య విభేదాలు ముదిరితే "48వ డివిజన్‌లో జనసేనకు ఛాన్స్ దక్కుతుందా ?" అనే ప్రశ్న ఆసక్తిని రేకెత్తిస్తోంది. చివరకు కూటమి పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# కొత్తూరు అమ్మవారిశాల అధ్యక్షులుగా ఏడాదిపాటు బచ్చు ప్రసాద్

## - మరో 3ఏళ్లు కల్లూరు నాగరాజు ఏకగ్రీవ ఎన్నిక



అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : అనంతపురం కొత్తూరు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సర్వసభ్య సమావేశం ఆదివారం రసవత్తరంగా కొనసాగింది. అయితే 16 ఏళ్లపాటు అధ్యక్షుడిగా గోపామచ్చ నరసింహులు సేవలందించారు. ఈ నేపథ్యంలో సభ్యులు ఆయనను అభినందించారు. ప్రస్తుతం ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రులకు గోపామచ్చ నరసింహులు ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. ఆ తర్వాత 2027 జనవరి 1 నుండి కొత్త కార్యవర్గం బాధ్యతలు చేపట్టనుంది. నూతన సంవత్సరంలో బచ్చు ప్రసాద్ అధ్యక్షుడిగా ఏడాది పాటు కొనసాగనున్నారు. అనంతరం 2028 జనవరి 1 నుండి మూడేళ్ల పాటు కల్లూరు నాగరాజు అధ్యక్షునిగా కొనసాగేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన అబ్దుల్ అజీజ్ కు టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మైనార్టీ సోదరులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, వక్ఫ్ ఆస్తుల నమోదు 68 వేల ఎకరాల నుంచి 82 వేల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. అనంతపురంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములకు నోటీసులు జారీ చేస్తున్నామని, వక్ఫ్ భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం మైనార్టీలకు హజ్ యాత్రకు సహాయం అందిస్తున్నామని అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు ఏడాదికి రూ.40 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 17 నెలల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించిందని తెలిపారు. పేద ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మరింత మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దుల్హన్ పథకాన్ని త్వరలో అమలు చేసేలా సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని అబ్దుల్ అజీజ్ అన్నారు. నారా లోకేష్ దేశ, విదేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఏపీని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో టీడీపీ మైనార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మైనార్టీలు, టీడీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, టిడిపి నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



అనంతపురం, సెప్టెంబర్ 6 అనంత సూర్య : త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో చూపుదామని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నామని, యువజన విభాగం కీలక పాత్ర వహించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం వైసీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని 1, 2, 19, 23, 24, 25, 27, 28, 29, 43, 44, 45, 46, 47, 48 డివిజన్లకు చెందిన యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంత వెంకటరామిరెడ్డి హాజరై దిశానిర్దేశం చేశారు. ఈరోజు జెన్‌జీ జమానా నడుస్తోందని, యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నీట్ పేపర్ లీకేజీపై యువత ఉద్యమిస్తే కేంద్ర మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటిగా డీఎస్సీ స్పోర్ట్ కోటా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలం చెందారని తెలిపారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమ గురించే ఆలోచిస్తుందని స్పష్టం చేశారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులు చేస్తోందని, వీటికి ఎవరూ భయపడొద్దన్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు మధ్య తేడాను ప్రజలకు వాస్తవాలతో వివరించాలని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి అక్రమాలకు పాల్పడిందని, పైగా ప్రచార ఆర్భాటం చేస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పథకాలను అందిస్తే అంతకంటే ఎక్కువగా ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకె చంద్రశేఖర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, ఇసాక్, సంపంగి రామాంజినేయులు, శ్రీనివాసులు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకె శ్రీనివాసులు, వైసీపీ నేతలు హనుమంతు, రామచంద్ర, రాజు, నిమ్మల నాగరాజు, నారాయణరెడ్డి, అరవింద్, ప్రసన్న లక్ష్మి, అబ్బాస్, మనోజ్, కుమార్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకనాథ్‌రెడ్డి, మణిరాయల్, జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, నగర అధ్యక్షుడు దత్త, ఉపాధ్యక్షుడు వినీత్, ఉదయ్, నగర ప్రధాన కార్యదర్శి మసూద్, మైను, నగర కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405